ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 26.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు

గురువారం 18 జూలై 2024


పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి

తొలి పండగ

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పలు ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. తొలి ఏకాదశి శ్రీమహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమించే రోజుగా పండితులు చెబుతారు. ఏకాదశి నుండే హిందువుల పండుగలు ప్రారంభమవుతాయి. ద్వారకాతిరుమలలో వేంకటేశ్వరస్వామిని బుధవారం తెల్లవారుజామున తొలిదర్శనం చేసుకున్నారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. జంగారెడ్డిగూడెం గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. పువ్వులు, తులసి దళాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచి స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థప్రసాద గోష్టి, బాలభోగ నివేదన అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలు, పేలాల పిండి పంపిణీ చేశారు.


ఏలూరులో శాకంబరి అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి

మొహరం


త్యాగాలకు చిహ్నం, ప్రేమ, త్యాగం, శాంతి సందేశాన్నిచ్చే మొహరంను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలో బుధవారం పీర్లను ఊరేగించి సాయంత్రం నిమజ్జనం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


విద్యుత్ మీటర్లను భద్రపరుస్తున్న సిబ్బంది

విద్యుత్ మీటర్లను భద్రపరిచారు

బుట్టాయగూడెం, జూలై 17:సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద విద్యుత్ మీటర్లు గుట్టగా పడిఉండడంపై 'తడిస్తే.. తడవనీ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. విద్యుత్ మీటర్లను కార్యాలయ ఆవరణలోనే వర్షం కురవని ప్రదేశానికి చేర్చి బరకాలు కప్పి భద్రపరచినట్లు ఏఈ శ్రీనివాసవర్మ తెలిపారు. సబ్‌స్టేషన్ భవనం పూర్తిగా శిథిలం కావడంతో విద్యుత్ వస్తువులు పెట్టడానికి వీలులేనంతగా వర్షం కురుస్తుందన్నారు. పాడయినవి, వెనక్కి పంపవలసిన మీటర్లు బయట ఉంచామన్నారు. తాను ప్రమాదానికి గురికావడంతో సెలవులో ఉన్నానని, మంగళవారం విధుల్లో చేరానన్నారు. విద్యుత్ మీటర్లు భద్రపరచడంలో సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

రెండు రోజుల్లో భారీ వర్షాలు

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఏలూరు సిటీ, జూలై 17: బంగాళాఖాతంలో అల్పపీడనం ఉధృతం కావడంతో రానున్న రెండు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. కుక్కునూరు, వేలేరుపాడు తహసీల్దార్లు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె వెట్రిసెల్వి ఆదేశించారు. బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సమయంలో చెట్లు, స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. భారీ వర్షాల హెచ్చరికతో రైతులు అప్రమత్తమయ్యారు. వరి నారుమడులు, నాట్లు దెబ్బ తింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


బాధితుడి వాంగ్మూలం తీసుకుంటున్న పోలీసులు

గంజాయి తేలేదని బ్లేడ్‌తో దాడి

నూజివీడు టౌన్, జూలై 17: గంజాయి తెమ్మంటే తేవా అంటూ ఒక యువకుడిపై బ్లేడ్‌తో దాడి చేసిన ఘటన నూజివీడులో చోటు చేసుకుంది. నూజివీడు పట్టణ బాపూనగర్‌కు చెందిన సంజయ్‌ను ముగ్గురు వ్యక్తులు ఒక వ్యక్తి నుంచి గంజాయి తెమ్మని అడిగారు. అతను నిరాకరించడంతో బాపూనగర్‌కు చెందిన గొడవర్తి నాగరాజు, మట్టా శివ, వక్కలగడ్డ రాజు సంజయ్‌పై బ్లేడ్‌తో దాడి చేశారు. గాయపడిన అతడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి, అతని వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాజరు వేసిన తర్వాత విద్యార్థులను బయటకు పంపొద్దు

విద్యా శాఖ అధికారుల ఆదేశాలు

ముదినేపల్లి, జూలై 17: విద్యార్థులకు హాజరు వేసిన తర్వాత బయటకు పంపవద్దని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు బయటకు వెళ్లాల్సి ఉంటే వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు జిల్లా చేబ్రోలులో పాఠశాల విద్యార్థిని మృతి వివాదాస్పదం కావడంతో అధికారులు ఈ ఆదేశాలు జారీ చేశారు.

- పేరెంట్స్ రాకుండా, వారి అనుమతి లేకుండా విద్యార్థులను బయటికి పంపించకూడదు.
- విద్యార్థికి ఆరోగ్య సమస్య వస్తే టీచర్, లేదా పీఈటీ ఆసుపత్రికి తీసుకెళ్లి, పేరెంట్స్‌కు సమాచారమివ్వాలి.
- పాఠశాల వేళల్లో బయటకు వచ్చిన విద్యార్థులకు ఏదైనా జరిగితే టీచర్లనే బాధ్యులను చేస్తారు.
- హాజరు విషయంలో విద్యార్థి లేకుండా పొరపాటున ప్రెజెంట్ వేయకూడదు.
- విద్యార్థులు చెప్పకుండా వెళ్లిపోతే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి స్కూల్‌కు పిలిపించి మాట్లాడాలి.

పల్లె.. పట్టణంలో జ్వరం


ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో జ్వర పీడితులు

జిల్లాను చుట్టుముడుతున్న వైరల్ ఫీవర్

> వర్షాకాలం ఆరంభంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. కానీ ప్రస్తుతం టైఫాయిడ్‌తో పాటు డెంగీ, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్లు చుట్టుముడుతున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ జ్వర పీడితులు ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకంటే ఎక్కువ మంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. నూజివీడు, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో డెంగీ, సాధారణ జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉంది. వర్షాల జోరుకు చలి కూడా పెరిగితే సీజనల్ వ్యాధులు మరింత ఉధృతమయ్యే పరిస్థితి ఉంది.
>
> – ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- నూజివీడులో టైఫాయిడ్ విజృంభణ
- ఏలూరు ఆసుపత్రిలో డెంగీ కేసులు
- ప్రైవేట్ ఆసుపత్రికి బాధితుల క్యూ
- మరింత ముదిరితే మందుల కొరతే
- ఐదేళ్ల నిర్లక్ష్యం ప్రజలకు శాపం
- పలుచోట్ల పారిశుధ్య సమస్య

సీజన్ వ్యాధులపై అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేసినా ఫలితం లేకపోతోంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా వైరల్ ఫీవర్ కేసులు భారీగా నమోదవుతున్నాయి. ఇది ఆందోళన కలిగిస్తోంది. ఒక దశలో ప్రభుత్వాసుపత్రికి వివిధ రోగాలతో వచ్చే బాధితుల సంఖ్య రెండంకెలు దాటేది కాదు. ప్రస్తుతం నాలుగంకెలు దాటుతోంది. ఏలూరులో ప్రభుత్వ వైద్యశాలలో రోజుకు అవుట్ పేషెంట్స్ 1000 నుంచి 1200కు పెరిగింది. వీరిలో అత్యధికం జ్వర బాధితులే. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో డెంగీ పీడితులు ప్లేట్‌లెట్లు పడిపోయి వైద్యం నిమిత్తం ఏలూరుకు వచ్చిన వారే. ఈ సీజన్‌లో ప్రధానంగా వైరల్, మలేరియా జ్వరాలు ఎక్కువగా ఉండేవి. సాధారణ జ్వరాలు తోడై ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కీళ్ల నొప్పులతోపాటు డయేరియా వెంటాడేది. ఈ క్రమంలోనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై పారిశుధ్యం మెరుగుపరచడం, ప్రజలను సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేసి పలు జాగ్రత్తలు తీసుకున్నారు. జ్వర పీడితులు తొలుత ఏ జ్వరమో నిర్ధారణ కాకముందే ఉపశమనం కోసం స్థానికంగా ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. మందుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేస్తున్నారు. తరువాత జ్వరం తీవ్రత పీడిస్తున్న సమయంలో ప్రభుత్వాసుపత్రుల్లో చేరుతున్నారు. ఈ క్రమంలోనే వైద్యులు అప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, జ్వర నిర్ధారణ పరీక్షలు చేసి వైద్య సేవలందిస్తున్నారు.

ఏలూరు జిల్లా కేంద్రంలో..

ఏలూరు ప్రభుత్వ వైద్యశాలతోపాటు అర్బన్ హెల్త్ సెంటర్లకు రోజు పెద్దసంఖ్యలోనే జ్వరపీడితులు వస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోజుకు సరాసరి వంద మంది జ్వర పీడితులు వస్తుండగా, 10 నుంచి 15 శాతం మంది డెంగీ బారిన పడినట్లు పరీక్షల్లో నిర్ధారణ అవుతోంది. వీరితోపాటు జిల్లాలోని వివిధ కేంద్రాల నుంచి ప్లేట్‌లెట్స్ పడిపోయిన స్థితిలో మరికొందరు ఆస్పత్రిలో చేరుతున్నారు. గడిచిన 15 రోజుల్లో డెంగీ పీడిత బాధితుల సంఖ్య దాదాపు 35 పైగానే ఉంది. ఈ నెల 16న ఒక్కరోజే ఏడుగురికి డెంగీ నిర్ధారణ అయింది. దీంతోపాటు సరైన సంఖ్యలో ప్లేట్‌లెట్స్ అందుబాటులో ఉంచేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మారుమూల ప్రాంతాల్లో డెంగీ పీడితుల సంఖ్య క్రమేపి పెరుగు తుండగా సమాంతరంగా డయేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ బాధితులు సంఖ్య అనూహ్యంగా ఉంది. వాతావరణ మార్పులు, వర్షాలు కురవడం, చలిగాలుల నేపథ్యంలో జ్వరపీడితుల సంఖ్య రెండు, మూడు రోజుల్లోనే పెరగవచ్చని వైద్యులు అంచనా వేస్తున్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి వచ్చే జ్వర పీడితుల్లో అత్యధికులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు.

మలేరియా తగ్గినా.. జ్వరాల వ్యాప్తి

ఏజన్సీ ప్రాంతంలో సాధారణంగా మలేరియా జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఇటీవల మలేరియా తగ్గుముఖం పట్టిందని వైద్యాధికారులు చెబుతున్నారు. బుట్టాయగూడెం ఐటీడీఏ పరిధిలో వైద్యుల అప్రమత్తత, రోగుల్లో కొంత చైతన్యం వచ్చి తక్షణం ఆసుపత్రికి రావడం, నివారణ మందులు తీసుకోవడంతో మలేరియా అదుపులో ఉంది. జూలైలోనే



ఇప్పటి వరకు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో దాదాపు 50 మందికి పైగా జ్వరపీడితులు చేరారు. బుట్టాయిగూడెం పరిధిలో వైరల్ ఫీవర్‌తో పాటు టైఫాయిడ్, బాధితుల సంఖ్య అనూహ్యంగా ఉన్నట్లు చెబుతున్నారు. వీరంతా సమీపంలోని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఒక్క బుట్టాయిగూడెం పీహెచ్‌సీ పరిధిలోనే 100 నుంచి 140 అవుట్‌పేషెంట్ల సంఖ్య ఉంటుంది. చింతలపూడిలో ఏరియా ఆస్పత్రి పరిధిలో జ్వరపీడితుల సంఖ్య క్రమేపీ పెరిగింది. సాధారణ జ్వరాలు, ఒళ్ళు నొప్పుల బాధితులకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. మరోవైపు ఏలూరు పరిసర మండలాల్లో కూడా చికున్ గున్యా ఛాయలు కనిపిస్తున్నాయి. విపరీతమైన ఒళ్ళునొప్పులు, కదల్లేని స్థితిలో అనేకమంది మంచానపడ్డారు. దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడమే కారణంగా కనిపిస్తోంది.

నూజివీడులో టైఫాయిడ్ విస్తరణ

నూజివీడు పరిసర మండలాల్లో టైఫాయిడ్ విస్తరిస్తున్నట్లు రోజు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే జ్వరపీడితుల సంఖ్యను బట్టి అర్థమవుతోంది. గడిచిన పక్షం రోజుల్లో టైఫాయిడ్, వైరల్ ఫీవర్, ఇతరత్రా జ్వరాలతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి వచ్చిన వారి సంఖ్య దాదాపు 450కి పైనే ఉంది. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి మించి ఈ సంఖ్య గణనీయంగా ఉండడం కొంత ఆందోళన కలిగిస్తోంది. నూజివీడు చుట్టుపక్కల ప్రాంతాలలో పారిశుధ్యం లోపించడం, ప్రత్యేకించి తాగునీటి విషయంలో శ్రద్ధ వహించకపోవడం తదితర పరిణామాలు టైఫాయిడ్‌కు కారణమవుతున్నాయి. టైఫాయిడ్ నిర్ధారణకు వీలుగా నూజివీడు ఆసుపత్రిలో ఎలీనా టెస్ట్‌లను రోజువారి నిర్వహిస్తున్నారు. వాస్తవానికి టైఫాయిడ్‌తో పాటు వివిధ రకాల జ్వరాలు కొంతలో కొంత తగ్గుముఖం పట్టాల్సి ఉన్నా రోజురోజుకు పెరగడం వైద్యులను సైతం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం అత్యవసర పరిస్థితి లేకపోయినా రోజువారీ రోగుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే మున్ముందు మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదని వైద్యులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ వైద్య ఆసుపత్రిలోనే కాకుండా పెద్ద సంఖ్యలో ప్రైవేట్ ఆసుపత్రిలో జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. దీనికితోడు గ్రామస్థాయిలో ఆర్‌ఎంపీలు సైతం కొంతలో కొంత తమకు తోచిన వైద్యాన్నే అందిస్తున్నారు.

ముంచుకొస్తున్న ముప్పు

గ్రామాలతో పట్టణాల్లో సైతం గత ప్రభుత్వం పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించలేదు. అప్పట్లో అధికారులను అప్రమత్తం చేసి ప్రజలను రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోలేదు. నిలిచిపోయిన మురుగు, చెత్తాచెదారం తొలగింపులో నిర్లక్ష్యం వహించారు. సీజనల్ వ్యాధులు కమ్ముకొస్తున్నా తక్షణ చర్యలు అంటూ హంగామా మినహా ప్రత్యేకించి చర్యలు ఏమీ అమలు చేయలేకపోయారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ చూసినా పారిశుధ్య లోపమే కనిపిస్తోంది. ప్రమాదభరిత డెంగీ కూడా దోమలు కారణంగా విస్తరిస్తోంది. సాధారణంగా జూలైలో డెంగీ, చికున్ గున్యాతో బాధపడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చేవారి సంఖ్య కేవలం వేళ్లపై లెక్కించేలా ఉండేది. ఇప్పుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోనే పదుల సంఖ్యలో డెంగ్యూ జ్వరపీడితులు చేరడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు మారుతున్న వాతావరణం, పెరుగుతు న్న వానలు, తోడైతే జ్వరపీడితుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం లేకపోలేదని ఇప్పటికే అంచనా వేస్తున్నారు.

తగినన్ని మందులు ఉన్నాయా?

సాధారణ జ్వరాలతో పాటు చికున్‌గున్యా, డెంగీ బాధితులను కాపాడేందుకు ప్రభుత్వాసుపత్రులలో మందులు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. బాధితుల సంఖ్య మరింత పెరిగితే కొన్ని ఆసుపత్రుల్లో మందుల కొరత తలెత్తే అవకాశం లేకపోలేదని కొందరు భావిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వాసుపత్రిలో టైఫాయిడ్ కిట్లు అందుబాటులో లేవు. కైకలూరు ఆసుపత్రిలో ఇటీవల ఒక దాత ముందుకు వచ్చి టైఫాయిడ్ కిట్‌లను ఆసుపత్రికి అందించారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే ఊహించవచ్చు.

కడెమ్మ స్లూయిజ్‌కు బీటలు


బీటలు వారిన కడమ్మ స్లూయిజ్ రక్షణ గోడలు

- కాల్వ అస్తవ్యస్తం
- గోదావరి, కొండ వాగుల జలాల తాకిడి
- 2 వేల ఎకరాలకు ముంపు ముప్పు
- తక్షణ చర్యలకు రైతుల వినతి

పోలవరం, జూలై 17: గోదావరి, కొండవాగుల వరదల నుంచి పోలవరం గ్రామానికి రక్షణగా శతాబ్దం క్రితం నిర్మించిన కడమ్మ స్లూయిజ్ శిథిలమైంది. గోదావరి వరద జలాలు పోలవరం గ్రామంలోకి ప్రవేశించకుండా ఏటిగట్టు కుడివైపు కొండవాగుల జలాలు గోదావరిలో కలిసేలా స్లూయిజ్ నిర్మించారు. స్లూయిజ్ నిర్వహణకు అధికారులు మొక్కుబడి చర్యలు చేపడుతున్నారు. ఏటా గేట్లకు గ్రీజ్ పూసి మమ అనిపిస్తున్నారు. స్లూయిజ్ ఎడమవైపు గోదావరి నీరు నిలవడం, కొండవాగుల జలాలు కుడివైపు నిలవడంతో పంటలు మునిగిపోతున్నాయి. వరద సమయంలో గేట్లు పూర్తిగా మూతపడక సుమారు 2 వేల ఎకరాల పంట పొలాలు మునుగుతున్నాయి. స్లూయిజ్ కిరువైపులా రక్షణ గోడలు బీటలు వాయాయి. గోడలు కూలిపోతే భారీ ప్రమాదం తప్పదు. అధికారులు స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

> **త్రిసభ్య కమిటీ ఏంచేసింది?**
>
> కడెమ్మ స్లూయిజ్ ముంపు సమస్యపై గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్ ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీ పరిశీలించింది. చేపట్టాల్సిన చర్యలు సూచిస్తూ నివేదిక ఇచ్చిన దాఖలాలు లేవు. సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో ఉపయోగించే భారీ మోటారును కడమ్మ స్లూయిజ్ వద్ద ఏర్పాటు చేస్తే వరదల సమయాలలో పంటలకు ముంపు ముప్పు తప్పుతుందని రైతులు సూచిస్తున్నారు.

పూడుకుపోయిన కాల్వ

కడమ్మ స్లూయిజ్‌కు వస్తున్న కాలువ పాండురంగడి కొండ వెంబడి సుమారు 25 అడుగుల వెడల్పున ప్రవహించేది. కొండ వెంబడి కాలువను పోలవరం ప్రాజెక్టు మట్టితో పూడ్చేశారు. కాలువ పూడుకుపోయి వర్షాల సమయంలో కొండవాగుల నీరు గోదావరిలోకి వెళ్లే మార్గంలేక చేలను ముంచెత్తుతున్నాయి. జల వనరుల శాఖ అధికారులు మూలలంక మట్టి డంపింగ్ వెంబడి మరో కాలువను తవ్వి సహజ కాలువకు స్లూయిజ్ అనుసంధానం చేశారు. దీంతో కొండవాగుల జలాలు స్లూయిజ్‌లోకి ప్రవహించేవి. వర్షా కాలం మూలలంక మట్టి కాలువలోకి జారి గేట్లు వద్ద మేట వేస్తోంది. పూడిక తొలగించకపోవడం, పుంతబాట ఆక్రమణతో కాలువ మరింత కుచించుకుపోయింది. తక్షణం పూడిక తొలగించి, గేట్ల మరమ్మతు చేపడితే ప్రస్తుత వర్షాలకు ముంపు ముప్పు తప్పుతుందని రైతులు చెబుతున్నారు.

రైతు భరోసా కేంద్రం



అలంకారప్రాయం

- తాళం వేసివున్న భవనాలు
- మూలనపడిన పరికరాలు
- పనికిరాని కియోస్కులు
- అధికారులపై నిర్వహణ భారం

ఏలూరు రూరల్, జూలై 17: వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే) అలంకారప్రాయంగా మిగిలాయి. క్లస్టర్ల వారీగా ఏలూరు అర్బన్, రూరల్ మండలంలో 17 రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.21.5 లక్షలు వెచ్చించారు. 17 రైతుభరోసా కేంద్రాల్లో చొదిమెళ్ళ, సుంకర వారితోట, పాలగూడెం కేంద్రాల్లో మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 14 భవనాలకు తాళం వేశారు. అధిక మొత్తం వెచ్చించి ఏర్పాటు చేసిన పరికరాలు మూలనపడ్డాయి. దీనికితోడు వాటిలో ఏర్పాటుచేసిన కియోస్కులు, ఎల్‌ఈడీ టీవీ, తదితర ఎలక్ట్రిక్ పరికరాలు నిరుపయోగం. కియోస్కులతో ఎరువులు, ఇతర వివరాలను తెలుసుకోవచ్చని ఆర్భాటపు ప్రచారం చేశారు. ఆర్బీకేలకు ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడం, ఉన్నా సకాలంలో బిల్లులు చెల్లించక కియోస్కులు మూలనపడ్డాయి. ఆర్బీకేలకు విద్యుత్ బిల్లు, సిబ్బంది జీతాలు ప్రభుత్వానికి భారం తప్ప రైతులకు ఉపయోగం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్బీకేలో నియమించిన బీఏఏలు సమీప గ్రామ, వార్డు సచివాలయాలకే పరిమితమై ఆర్బీకేల్లో అందుబాటులోకి ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మూలపడిన పరికరాలు

ఆర్బీకేల్లో అధునాతన సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేశాం. కియోస్కులలో పశువుల దాణా, వ్యవసాయానికి ఎరువులు, రైతుభరోసా పథకం చూడవచ్చని ప్రచారం చేశారు. రైతులకు వాటిని ఉపయోగించే విధానం తెలియదు. కనీసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదు. విద్యుత్ బిల్లుల భారం వ్యవసాయశాఖ అధికారులపై పడింది. కొందరు సొంత సొమ్ముతో విద్యుత్ బిల్లులు చెల్లించారు. ఆ మొత్తం తిరిగి వచ్చేనా అని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మారడంతో సహజంగానే బదిలీలు వస్తాయి. వాటిలో స్థాన చలనం అయితే తమ సొంత సొమ్ములు విద్యుత్ బిల్లులుగా చెల్లించిన సొమ్ములు తిరిగి రాకపోవచ్చని అధికారులు ఆందోళన చెందుతున్నారు.


అంగన్వాడీ టీచర్ ఇంటి చుట్టూ కంచె, క్లాత్

అంగన్వాడీ టీచర్ కుటుంబానికి వేధింపులు

వైసీపీ నేతల హెచ్చరికలు

నూజివీడు టౌన్, జూలై 17: డిమాండ్ల సాధన కోసం గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యమబాట పట్టిన అంగన్వాడీలకు నేటికీ కష్టాలు వెన్నాడుతున్నాయి. ప్రభుత్వం మారినా అంగన్వాడీ టీచర్‌పై వేధింపులు కొనసాగుతున్నాయి. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లిలో టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారంటూ అంగన్వాడీ టీచర్ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ మాదిరి ఇంటికి దారి లేకుండా కంచె వేసి, క్లాత్ కట్టేశారు. పోతిరెడ్డిపల్లి ఎస్సీ పేటకు చెందిన అంగన్వాడీ టీచర్ ఊస వసుంధర గత ప్రభుత్వంలో అంగన్వాడీల ఉద్యమంలో పాల్గొంది. దీనితో అప్పట్లో వైసీపీ నేతలు వేధింపులకు గురిచేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారినా మీ కుటుంబం టీడీపీకే అనుకూలంగా వ్యవహరించిందని మరింత వేధింపులు పెరిగాయి. గ్రామ పెద్దల దృష్టికి విషయం వెళ్లినా పరిస్థితిలో మార్పు లేదు. వారు నివసిస్తున్న ఇంటికి దారి లేదంటూ ఈ నెల 9న స్థానికులు కుమార్, శ్రీనివాసరావు, దుర్గారావు కంచె వేశారని బాధితులు వాపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కంచెను తొలగించలేదని, వెలి వేస్తామని హెచ్చరిస్తున్నారని ఆమె భర్త రాజు ఆరోపించారు. వసుంధర అంగన్వాడీ టీచర్ కాగా తాను ఆటో నడుపుకొని జీవిస్తున్నానని, తన సోదరులకు వేధింపులు తప్పడం లేదని వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



నేత్రపర్వం..జగన్నాథుని రథోత్సవం

ద్వారకాతిరుమల, జూలై 17: ద్వారకా తిరుమల మండలం లక్ష్మీపురంలో జగన్నాథ స్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం శోభాయమానంగా జరిగింది. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ పూరి క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అట్టహాసంగా కోవెల నుంచి తెచ్చి రథంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై ఉంచి అలంకరించారు. పూజలు, బలిహరణల అనంతరం రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, సన్నాయి డప్పువాయిద్యాలు, కోలాట భజనల నడుమ రథయాత్ర తిమ్మాపురం వరకూ నేత్రపర్వంగా జరిగింది. అతి పురాతనమైన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయంగా విరాజిల్లుతోంది. రథోత్సవాలు ఈనెల 7 నుంచి ప్రారంభమై బుధవారంతో ముగిశాయి.



వైభవంగా శ్రీవారికి ఏకాదశి ఉత్సవం

శ్రీవారి ఏకాదశి ఉత్సవం బుధవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తొళక్కవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం పూజాధికాలను జరిపి ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర తిరు వీధులకు తీసుకొచ్చారు.

కనక దుర్గమ్మకు రజిత కవచం



పాలకొల్లు అర్బన్; జూలై 17 : పాలకొల్లు యడ్లబజారులోని కనక దుర్గమ్మవారికి భక్తులు రజిత కవచం బహూకరించారు. సుమారు రూ.6 లక్షల విలువైన 5 కిలోల వెండితో తయారు చేయించిన ఈ కవచాన్ని బుధవారం పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి నెక్కంటి ఆదినారాయణ జ్ఞాపకార్థం భార్య సత్యవతి, కుమారుడు శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు కార్య నిర్వహణాధికారి సతీష్ కుమార్‌కు అందజేశారు. అర్చకులు మోగింటి వెంకటరమణ సంప్రోక్షణాది కార్యక్రమాలు జరిపించి అమ్మవారికి అలంకరించారు.



కేంద్ర మంత్రిని కలిసి సత్కరిస్తున్న అధికారులు

ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దును ఆహ్వానిస్తున్నాం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, జూలై 17 : రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్య మంత్రి చంద్రబాబు ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేశారని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టును కేంద్ర ప్రభుత్వానికి ఆపాదించాలని చూసిందని ఆరోపించారు. అదే విధంగా ప్రచారం కూడా చేశారని ప్రజలు వైసీపీ ప్రభుత్వం మోసాన్ని గుర్తించి గుణపాఠం చెప్పారన్నారు. అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు మంజూరు చేసినప్పటికీ గత ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్ళించారని దీనిపై నివేదికలు లేవని విచారణ చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. పలువురు అధికారులు ఆయనను సత్కరించారు.



భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు క్రైం, జూలై 17 : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజినల్ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ కేసులు, ఇంక్రిమెంటు కోతలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నాయకురాలు కె.రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఏలూరు సీఐటీయూ కార్యాలయంలో బుధవారం బహుజన ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల, ఎంఆర్‌పీఎస్ సంఘం నాయకులు సమావేశమయ్యారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అన్ని డిపోల్లో అక్రమ ఓడీలను అరికట్టి అర్హులైన ఉద్యోగ సిబ్బందికి అవకాశం కల్పించాలన్నారు. అదే విధంగా ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తరువాత కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 2019/1 శిక్షా స్మృతులను అమలు చేయకుండా 1964 శిక్షా స్మృతులను అమలు చేస్తున్నారని వీటిని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అనుమానాస్పద మృతిపై కుటుంబ సభ్యులు డిసెంబర్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటి వరకూ ఏ విధమైన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడి కారణంతోనే దర్యాప్తు చేయకుండా రోడ్డు ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారన్నారు. ఆయన మృతిపై సీబీసీఐడి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి గోరింక అనిల్‌కుమార్, బహుజన ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ ఫరీద్ ఖాసీమ్, ప్రధాన కార్యదర్శి చిర్రా సామ్‌సన్, జిల్లా కార్యదర్శి రాజా, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలివెల చంటి, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఎడారి ఊరిలో..

పొట్టకూటి కోసం కన్నవారిని, కట్టుకున్న భార్యను వదిలి గల్ఫ్ దేశాలకు వెళ్లి చాలామంది మోసపోతున్నారు. అప్పోసొప్పో చేసి అక్కడకు వెళితే ఉపాధి దొరక్క నానా తిప్పలు పడి ఉసూరుమంటూ వెనక్కు వస్తున్నారు. ఉన్న ఊరులో బతకలేక బతుకు దెరువు వెతుక్కుంటూ కుటుంబాలను వదిలి గల్ఫ్ దేశాలకు వెళితే అక్కడ దళారులు చేస్తున్న మోసాలకు ఎంతోమంది బలవుతున్నారు. విజిట్ వీసాలతో వెళ్లి అక్కడ నిలువు నీడ లేక ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారు.

నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన జయరాంకు భార్య ఇద్దరు ఆడ పిల్లలు. ఎల్‌కెజీ, నర్సరీ చదువుతున్నారు. వ్యవసాయ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. వయసులో ఉన్నప్పుడే నాలుగురాళ్లు సంపా దించుకోవాలనే తాపత్రయంతో తెలిసిన వారి ద్వారా ఏజెంటును సంప్రదించి దుబాయ్ వెళదామనుకున్నాడు. మంగళసూత్రాలు తాకట్టుపెట్టి ఏజెంట్‌కు లక్షా 50 వేల రూపాయలు ఇచ్చాడు. సొమ్ములు చెల్లించి 25 రోజులు గడు స్తున్నా వర్క్ వీసా ఇవ్వలేదు.గట్టిగా అడిగేసరికి టూరిస్టు వీసాతో దుబాయ్ విమానం ఎక్కించేశాడు. అక్కడ వర్క్ వీసా లేకపోవడంతో అక్కడి ఏజెంట్లు 15 రోజుల పాటు నరకం చూపించారు. అక్కడికి ఇక్కడకు తిప్పుతూ షార్జా సమీపాన గత హజ్‌మాస్‌లో ఊరిచివర ఒక చిన్న గదిలో బంధించగా తప్పించుకొని వచ్చినట్టు జయరాం చెప్పుకొచ్చాడు.

వ్యవసాయ కుటుంబంలో పుట్టి ఐటీఐ చదివిన పత్తేపురం గ్రామానికి గెడ్డం ప్రవీణ్ ఇక్కడ సరైన ఉపాధి లేకపోవడంతో దుబాయ్ వెళ్లి సంపాదించుకోవచ్చనే ఆశతో విమానం ఎక్కితే ఏజెంట్ చేసిన మోసాలకు బల య్యాడు. ఎయిర్‌పోర్టులో జాబ్ అని చెప్పి మోసం చేసి సొమ్ములు కాజేశారు. వర్క్ వీసా లేకపో వడంతో అక్కడి ఏజెంట్లు రోజుకో రూము మార్చి చివరికి ఊరి చివర రూములో బంధించగా తప్పించుకొని అక్కడే తెలిసిన వారి దగ్గర ఉంటూ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. గత నెలలో దుబాయ్ లో ఏజెంటు ద్వారా వెళ్లి పని దొరక్క అక్కడే చిక్కు పడిపోయాడు. తమ వద్ద 1 లక్షా 30 వేలు వసూలు చేసి ఏజెంట్ మోసం చేసిందని అతని సోదరుడు కిషోర్ ఆంధ్రజ్యోతి వద్ద వాపోయాడు.

మోసపోయిన వారెందరో..

- మూడేళ్ల క్రితం భీమవరం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఒక 30 సంవత్సరాల మహిళ దుబాయ్ వెళ్లింది. ఏజెంట్ మోసం చేయడంతో అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంది. కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో పోలీసుల ద్వారా ఆమె స్వదేశానికి వచ్చింది.
- పోడూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఒక మహిళ చేసిన అప్పులు తీర్చలేక ఖత్తర్ దేశానికి వెళ్ళి ఇబ్బందులు ఎదుర్కొంది. మొత్తం మీద ఆమెను అక్కడి అధికారులతో మాట్లాడి స్వదేశానికి తీసుకువచ్చారు.
- పాలకోడేరు మండలానికి చెందిన ఒకరు గల్ఫ్ దేశాలకు వెళ్ళి అక్కడ ఉండలేక ఏజెంటు చేసిన మోసానికి స్వదేశానికి తిరిగి వచ్చేశారు. అలా వచ్చేయడం వల్ల రూ.3 లక్షల వరకు నష్టం వచ్చింది.
- మొగల్తూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తోటపని చేసేందుకు గల్ఫ్ వెళ్ళారు. తీరా అక్కడ ఒంటెలను పెంచాలని చెప్పడంతో నానా అవస్థలు పడ్డారు. ఇచ్చిన సొమ్ము నష్టపోయినా తిరిగి ఇంటికి వచ్చేశారు.
- ఉండి మండలానికి చెందిన ఒక వ్యక్తి ఉద్యోగం ఉందని గల్ఫ్ దేశానికి పంపించారు. తీరా అక్కడకు వెళ్ళిన తరువాత జంతువుల మాంసం కొట్టే పని చెప్పడంతో ఇంగుతిని నెలరోజులకే తిరిగి వచ్చేశాడు.

పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు..
ఏజెంట్ల దోపిడీతో అవస్థలు
విజిట్ వీసాలతో బిక్కుబిక్కుమంటూ..
తిరిగి వచ్చేందుకు నానా అగచాట్లు

భీమవరం రూరల్/ భీమవరం క్రైం/ నిడమర్రు, జూలై 17 : గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్ళేవారికి ప్రాణ సంకటంగా మారుతోంది.. మధ్య వర్తిగా వ్యవహరించే ఏజెంట్లు దోపిడీతో ఇతర దేశాలకు వెళ్లి ఉద్యోగాలు



లేక అవస్థలు పడుతున్నారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దిక్కుతోచని పరిస్థితుల్లో గల్ఫ్ దేశాలలో ప్రాణాలు విడుస్తుంటే మరికొందరు తిరిగి వచ్చేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. కొన్నిరోజుల క్రితం పశ్చిమ గోదావరి జిల్లాలోని నిడమర్రు, పాలకోడేరు పలు మండలాల నుంచి 10 మందికి పైగా యువత ఉద్యోగాల కోసం గల్ఫ్ దేశాలు వెళ్లి మోసపోయారు. భీమవరం మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలోని ఒక మహిళా ఏజెంట్ మోసపూరిత వ్యవహారంతో అక్కడ ఉద్యోగం పొందలేకపోయారు. దీనిపై అక్కడ నుంచి వారు వాట్సప్ వీడియోల ద్వారా మోసపోయామని, తిరిగి రావడానికి దారి చూపాలని వారు పంపిన వీడియో వైరల్ అయింది.

అప్పు చేసి వెళ్తున్నారు.. ఉపాధి లేక వస్తున్నారు..

గల్ఫ్ దేశాలకు వెళ్ళాలంటే లక్షల రూపాయలు ఏజెంట్ చేతిలో పెట్టాల్సి వస్తుంది. మధ్యతరగతి కుటుంబీకులు ఆదాయం పెంచుకునేందుకు అప్పులు చేసి మరీ ఏజెంట్ల చేతిలో సొమ్ములు పెడుతున్నారు. ఈ మధ్యకాలంలో ఇదొక వ్యాపారంగా పెట్టుకున్న మోసపూరిత ఏజెంట్లు మధ్య తరగతి కుటుంబాలను మోసం చేస్తున్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్ళినవారు మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. అక్కడ సరైన ఉద్యోగాలు లేకపోవడంతో ఇళ్లల్లో పాచిపనులకు కూడా చేరుతున్నారు. దీంతో యజమానులు పెట్టే చిత్ర హింసలు భరించలేక వెళ్లిన కొద్ది రోజులకే తిరిగి వచ్చేస్తామంటూ సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తున్నారు. జిల్లాలోని పాలకొల్లు, పోడూరు, పాలకోడేరు, నర్సాపురం, మొగల్తూరు, భీమవరం మండలాలకు సంబంధించిన ఎక్కువ మంది మహిళలు ఇలా మోసపోయినవారిలో ఉన్నారు. ఇటీవల అన్నమయ్య జిల్లా వాసి ఒకరు తన ఇబ్బందులను సోషల్ మీడియాలో పోస్టు చెయ్యడంతో మంత్రి నారా లోకేష్ స్పందించి అతడిని స్వదేశానికి రప్పించారు.

• నకిలీ ఏజెంట్లపై చర్యలు తీసుకుంటాం

పశ్చిమ ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



నకిలీ ఏజెంట్లపై చర్యలు తీసుకుంటాం. ఎవరూ కూడా ఏజెంట్లు మాటలు నమ్మి గల్ఫ్ దేశాలకు వెళ్ళి మోసపోవద్దు. రిజిస్ట్రేషన్ ఉన్న ఏజెంట్లు ద్వారా మాత్రమే ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాలి. ఏజెంట్ల మోసాలపై ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

• నరకం చూశాను..



నా భార్య ఇద్దరు ఆడపిల్లలు.. వారిని వదిలి బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లేందుకు ఏజెంట్‌కు లక్షా 50 వేలు ఇచ్చాను. అక్కడ పని లేదు.. డబ్బు పోయింది. సుమారు 55 రోజులు తీవ్ర నరకం చూశాను. ఎలాగోలా తప్పించుకొని ఇండియాకు చేరుకొన్నా. ఏజెంటు నుంచి మాకు రావల్సిన సొమ్ము ఇప్పించాలి.

- గణసల వెంకట్రాజు, తోకలపల్లి ,నిడమర్రు మండలం

• సెక్యూరిటీ ఉద్యోగమంటే వెళ్లాను



ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ ఉద్యోగ మంటే విమానమెక్కాను. ఏజెంటు కు 1 లక్షా 50 వేలు ఇచ్చాం. టూరిస్టు వీసా మీద వెళ్లిన మేము చివరకు 50 రోజుల పాటు ఎన్నో చిత్రహింసలకు గురయ్యాం. మానసికంగా ఎంతో క్షోభ అనుభవించాం. ఇంటి నుంచి డబ్బులు తెప్పించుకొని స్వగ్రామం చేరుకొన్నాం. మమ్మల్ని మోసం చేసిన ఏజెంట్ జాన్సీని వెంటనే శిక్షించాలి. మాకు డబ్బులు ఇప్పించేలా చూడాలి

-జయరాం, తోకలపల్లి

ఎంపీడీవో ఎక్కడున్నారు ?



ఇంకా లభించని ఆచూకీ
విజయవాడ, ఏలూరు జిల్లాల్లో గాలింపు

నరసాపురం రూరల్, జూలై 17: నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ ఆచూకీ లభించ లేదు.కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు విజయవాడ, ఏలూరు జిల్లాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఏలూరు కాల్వ వద్ద ఎంపీడీవో చెప్పులు కనిపించడంతో గజ ఈతగాళ్లతో కాల్వ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం వరకు ఆయన ఆచూకీ దొరకలేదు. నరసాపురం రేవు నిర్వహణదారుడు రెడ్డప్ప ధవేజీ మండల పరిషత్‌కు రూ.55 లక్షల వరకు చెల్లించాలి. ఈ బాకీ వసూలు విషయమై ఆయన రెండు నెలల నుంచి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నెల 3 నుంచి మెడికల్ లీవ్ పెట్టి కృష్ణా జిల్లా పెనమలూరులో ఆయన ఇంటి వద్దనే ఉంటున్నారు. 17 వ తేదీ సోమవారం మచిలీపట్నం వెళ్లిన ఎంపీడీవో ఇంటికి తిరిగి రాలేదు. ఎంపీడీవో సెల్ నుంచి భార్యకు మెసేజ్ రావడంతో కుటుంబ సభ్యులు పెనుమలూరు పోలీస్‌లను ఆశ్రయించారు. రెండు రోజుల నుంచి అన్ని కోణాల్లో గాలించినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించలేదు. ఇప్పటి వరకు పోలీసులు మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో ఎంపీడీవో బైక్‌ను, విజయవాడలోని ఏలూరు కెనాల్ వద్ద ఆయన చెప్పులను మాత్రమే గుర్తించారు. దీంతో ఆయన అదృశ్యం పెద్ద మిస్టరీగా మారింది. ఎంపీడీవో ఇంటికి క్షేమంగా రావాలని మండల పరిషత్ ఉద్యోగులతో పాటు సిబ్బంది, పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. బకాయిపడ్డ ధవేజీ నుంచి ఎటువంటి స్పందన లేదు. కనీసం మండల పరిషత్ అధికారులతో ఆయన చర్చించ లేదు. దీంతో బాకీ కడతారా ? లేదా అన్న దానిపై పెద్ద చర్చ సాగుతోంది.

• ఆయనకు ఏమైనా జరిగితే బాధ్యులపై కేసులు

ఎమ్మెల్యే నాయకర్



తన సర్వీస్‌లో అవినీతి మచ్చ లేకుండా నిజాయితీగా పని చేస్తున్న ఎంపీడీవో వెంకటరమణకు ఏమైనా జరిగితే మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, నిర్వహణదారుడు రెడ్డప్పధవేజీ, జేఏసీ కమిటీ సభ్యులపై కేసు పెడతామని ఎమ్మెల్యే నాయకర్ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాకీ విషయంపై రేవు నిర్వహణదారుడు ధవేజీకి అనేకమార్లు ఫోన్‌లు చేసినా, నోటీసులు ఇచ్చినా స్పందించలేదన్నారు. ఇదే విషయం ఎంపీడీవో రెండు మూడు సార్లు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. బాకీ విషయంలో ఎంపీడీవో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మెడికల్ లీవ్ పెట్టారన్నారు. ముదునూరి నిర్లక్ష్యం వల్లే నిజా యితీపరుడైన ఎంపీడీవో బలి కావాల్సి వచ్చిందన్నారు. ఆయనకు ఏమైనా జరిగితే ఆ కుటుంబానికి ఏం సమాధానం చెపుతారంటూ నిలదీశారు. అవసరమైతే సీఎం చంద్రబాబు, జిల్లా కలెక్టర్ వద్దకు సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆయన ఎక్కడ ఉన్న క్షేమంగా ఇంటికి రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

ఎంపీడీవోకు అండగా ఉంటాం : పొత్తూరి



ఎంపీడీవో, ఆయన కుటుంబ సభ్యులకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు భరోసా ఇచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ అవినీతి ఆక్రమాలకు ప్రజలతో పాటు అధికారులు కూడా బలయ్యారన్నారు. బకాయిదారుడు పెండింగ్ సొమ్ము చెల్లించకపోవడం వల్లే ఎంపీడీవో మానసిక ఒత్తిడికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయరాన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

భీమవరం క్రైం, జూలై 17 : తనను ప్రేమించలేదన్న కోపంతో ఒక యువకుడు తోటి విద్యార్థిని ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చెయ్యడంతో అతనిపై పోక్సో కేసు నమోదైంది. భీమవరం శివారు ప్రాంతానికి చెందిన ఒక బాలిక ఇంటర్ చదువుతుంది. ఆమె తోటి విద్యార్థి టి.నర్సాపురం మండలం వెలగపాడు గ్రామానికి చెందిన బాలకృష్ణ అదే కళాశాలలో చదువుతున్నాడు. బాలికతో స్నేహంగా ఉంటూ ప్రేమించమని వేధించేవాడు. ఆ విషయం కళాశాల దృష్టికి వెళ్లడంతో అతనికి టీసీ ఇచ్చి పంపించివేశారు. అది మనసులో పెట్టుకుని గతంలో ఆ బాలికతో కలిసి దిగిన ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చెయ్యడంతో కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోక్సో, ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అత్యాచార నిందితులు నలుగురి అరెస్ట్

టి.నరసాపురం, జూలై 17: మండలంలో ఒక గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక పై అత్యాచారానికి పాల్పడిన యువకునితో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు పోలవరం డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అత్యాచార ఘటనపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నాగ కుమార్‌తో పాటు అతనికి సహకరించిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపారు.



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన హర్యానా బృందం

వెల్లమిల్లిలో ప్రకృతి వ్యవసాయంపై హర్యానా బృందం పరిశీలన

ఉంగుటూరు, జూలై 17 : మండలంలోని వెల్లమిల్లి, నాచుగుంట గ్రామాల ఆయకట్టులో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను హర్యానాకు చెందిన బృందం సందర్శించింది. రైతులు, అధికారులు, సర్పంచుల బృందం జిల్లాలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఇక్కడి క్షేత్రాలను సందర్శించి వివిధ పంటల పరిస్థితులను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీనివాసరావు (మండల వ్యవసాయాదికారి) జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ తాతారావు, అసిస్టెంట్ మేనేజర్ వలి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్లు నాగమణి, సంధ్యారాణి, సత్య తదితరులు పాల్గొన్నారు. పంట దిగుబడి, కాలపరిమితి తదితర అంశాలపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఐపీఎస్ అధికారుల సాధారణ బదిలీలు

ఏలూరు క్రైం, జూలై 17 : ఐపీఎస్ అధికారుల సాధారణ బదిలీల్లో ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న జిల్లాలకు నూతన ఎస్పీలను ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే కొంత మంది విధుల్లోకి చేరి ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందిం చారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీగా నరసింహ కిషోర్, కృష్ణా జిల్లా ఎస్పీగా రెడ్డి గంగాధరరావు, కాకినాడ జిల్లా ఎస్పీగా విక్రమ్ పాటిల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వీరందరూ బుధవారం ఏలూరు డీఐజీ కార్యాలయానికి వచ్చి ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

111 మంది ర్యాంకర్ ఎస్ఐలు బదిలీ

ఏలూరు క్రైం, జూలై 17 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న ఎస్ఐలలో 111 మందిని ఎన్నికల నియమావళిని అనుసరించి సొంత జిల్లాకు చెందిన ఎస్ఐలను వేరే జిల్లాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో ర్యాంకర్ ఎస్ఐలను తిరిగి ఏ జిల్లా నుంచి వచ్చారో ఆ జిల్లాలకే పంపించడానికి రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న 111 మంది ఎస్ఐలు ఎన్నికల ముందు ఏ జిల్లా నుంచి బదిలీ అయ్యారో తిరిగి ఆ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలకు గురువారం రిపోర్టు చేయనున్నారు. తిరిగి వారికి ఆ జిల్లాలో సంబంధిత ఎస్పీలు పోస్టింగ్‌లు ఒకటి రెండు రోజుల్లో కల్పించనున్నారు.


పట్టిసీమ నుంచి 3,540 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం జూలై 17 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 3,540 క్యూసెక్కుల వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు బుధవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.559 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 10 పంపులు 10 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటి వరకూ 6.6218 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

పోలవరంలో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నదిలోకి కలుస్తున్న వరద జలాలను స్పిల్వేలోకి నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.970 మీటర్లు, స్పిల్వే దిగువన 17.050 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 27.070 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 16.120 మీటర్లు నమోదైనట్లు ఈఈలు వెంకటరమణ,మల్లిఖార్జునరావు తెలిపారు.

బోరు పైపును పూడ్చిన అగ్నిమాపక, ఓఎన్‌జీసీ అధికారులు



ఆచంట, జూలై 17 : ఆచంట శివారు కోనపోతు గుంటలో బండి వెంకటకృష్ణకు చెందినబోరు పైపు నుంచి మంగళవారం రాత్రి వింత శబ్దాలు వాయువుతో కూడిన బురద మట్టి, గ్యాస్ పైకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సమాచారాన్ని అగ్నిమాపక, ఓఎన్‌జీసీ అధికారులకు అందించడంతో జిల్లా అగ్నిమాపక అధికారి బి. శ్రీనివాసరావు సహాయ అధికారి జానకి రాము, ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి, సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి తాత్కాలికంగా మట్టితో పూడ్చి వేశారు. అనంతరం బుధవారం అధికారులు మరోసారి పరిశీలించారు. పైపుపై ఇసుక వేసి సగం వరకు పూడ్చి వేసి తరువాత బ్యాలెట్ పౌడర్‌తో భూమికి సమాంతరంగా పూడ్చారు. ఇక ఎటువంటి భయం ఉండదని అధికారులు స్థానికులకు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహరం



ఏలూరు పాతబస్టాండ్ అంబెడ్కర్ సర్కిల్లో పీర్ల ఊరేగింపులో ముస్లింలు

ఏలూరు రూరల్, జూలై 17: ఏలూరు మెయిన్ బజారు గొలుసు పంజాలో హజరత్ మౌలాఆలీ మహాత్ముల ఆ స్థానం ఆధ్వర్యంలో మొహరం వేడుకలు వైభవంగా జరిగాయి. కొద్ది రోజులుగా మోహరం వేడుకలను వివిధ రూపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం ప్రత్యేక పూజలు, అగ్నిగుండం ద్వారా తమ భక్తిని చాటుకుని సాయంత్రం పీర్ల పంజా కమిటీ నిర్ణయించిన ప్రదేశాల్లో జల్టీ కార్యక్రమంతో, అలంకరణతో పురవీధుల్లో పీర్లు ఊరేగించి, కార్యక్రమాలను బుధవారంతో ముగించారు.

నెల్లూరు రొట్టెల పండుగకు తరలి వెళ్లిన ముస్లింలు

పోలవరం : మొహరంపండుగ సందర్భంగా పోలవరం మండలం నుంచి ముస్లింలు బుధవారం ప్రత్యేక బస్సులో నెల్లూరు రొట్టెల పండుగ దర్గాకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు మహబూబ్ జానీ మాట్లాడుతూ తమ కోరికలు తీర్చమని సముద్ర తీరాన రొట్టెలు పంచుతారని తెలిపారు. స్థానిక అహెలె సున్నత్ జమాతె మసీదులో పోలవరం ప్రాజెక్టులో పని చేస్తున్న ఇతర రాష్ట్రాల ముస్లిం కార్మికులు, పోలవరం ముస్లింలు, సుమారు 1500 మంది నమాజు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

● టినరసాపురం : బొర్రంపాలెం, ఏపీగుంట తదితర గ్రామాల్లో మొహరం వేడుకలు 11 రోజులుగా ముసీంలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజు బొర్రంపాలెంలో పీర్లను మేళతాళాలు, విచిత్ర వేషధారణలతో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● చింతలపూడి : పవిత్రమైన మొహరం రోజున పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటారు. గతంలో చింతలపూడిలో కొందరు ముసీంలు ఈ పీర్లను గ్రామంలో ఊరేగించి ప్రార్థనలు జరిపేవారు. ప్రస్తుతం త్యాగాలను స్మరించుకుని ప్రార్థనలు జరిపి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● జంగారెడ్డిగూడెం : హజరత్ హుసేన్ త్యాగానికి గుర్తుగా మొహరం సందర్భంగా ముస్లీంలు పట్టణంలో పీర్లు ఊరేగించారు. నిప్పుల గుండంపై పీర్లు చేతపట్టుకుని నడిచారు. షేక్ అమీర్,పఠాన్ పర్వేజ్, సయ్యద్ జానీ, ముస్లీం యువకులు పాల్గొన్నారు.

● భీమడోలు : మొహరం పండుగ సందర్భంగా సంత మార్కెట్లో ఉన్న మసీదులో మహమ్మదీయ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ అసీనా, ఉపాధ్యక్షుడు షేక్ అసీన్ సాహెబ్, ట్రెజరర్ షేక్ షరీఫ్, షేక్ దాలిం సాహెబ్, మసీదు ఇమామ్ షేక్ దిల్‌షాద్ పాల్గొన్నారు.

● కామవరపుకోట : మండలంలోని పలు గ్రామాల్లో ముస్లీంలు మసీదుల వద్ద, ప్రార్థనా స్థలాల వద్ద మొహరం పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందూ, క్రైస్తవులకు మొహరం శుభాకాంక్షలు తెలియచేశారు. కామవరపుకోట, గుంటుపల్లి, కేఎస్ రామవరం, కళ్ళచెరువు, అంకాలంపాడు, తడిక లపూడి, ఆడమిల్లి గ్రామాల్లో ముస్లీంలు మొహరం వేడుకలను వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : బాలరాజు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం, జులై 17 : గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. బూసరాజుపల్లిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను బుధ వారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశా రు. తరగతి, వంట గదులను పరిశీలి ంచారు. మెను ప్రకారం భోజనం పెడుతున్నది లేనిదీ పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అంతకముందు బుట్టాయగూడెంలోని గంగానమ్మ తల్లిని, కుమ్మరగట్టులోని శ్రీవిఘ్నేశ్వ రస్వామిని దర్శించుకున్నారు. కరాటం సాయి, ప్రిన్సిపాల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యారెడ్డికి పరామర్శ



చింతలపూడి, జూలై 17: చింతలపూడి సీనియర్ టీడీపీ నాయకుడు జగ్గవరపు ముత్యారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బుధవారం పరామర్శిం చారు. ఇటీవల ఆయనకు బైపాస్ సర్జరీ జరిగింది. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం

భీమడోలు, జూలై 17 : కొల్లేరు ప్రజలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. ఆగడాలలంక, చెట్టున్నపాడు గ్రామస్తులు బుధవారం వీరాంజనేయులును సత్కరించారు. సమస్యలపై దృష్టి సారించాలని తాగునీరు, రోడ్లు, కొల్లేరు సంప్రదాయ సాగు తదితర సమస్యలపై దృష్టి సారించాలని గ్రామస్తులు విన్నవించారు. గన్ని మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మరాజు, ఎంపీ మహేష్‌కుమార్‌తో చర్చించి కొల్లేరులో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నాయకులు శిరిబత్తిన కొండబాబు, నాని పాల్గొన్నారు.

పాటదారులకు లీజు పత్రాలు అందజేత

బుట్టాయగూడెం, జులై 17 : రామన్నగూడెంలోని శ్రీసీతారామస్వామి ఆలయం భూములకు చెందిన భూముల లీజు పత్రాలను సరియం వెంకటేశ్వరావు, నిమ్ము దామోదర కుమార్‌కు బుధవారం అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సోము హరినారాయణ తెలిపారు. జూన్ 13న రామాలయం వద్ద దేవాదాయ శాఖ అధికారులు స్వామివారి భూములను మూడేళ్ల సాగు చేసుకోడానికి వేలం నిర్వహించగా బోడిగూడెంకు చెందిన వెంకటేశ్వరావు, రామన్నగూడెంకు చెందిన దామోదరకుమార్ హెచ్చు ధరకు దక్కించుకున్నారు. వీరికి లీజుపత్రాలను అధికారులు అందజేశారు. కమిటీ సభ్యులు పావిల వీరకృష్ణ, కోనం శ్రీనివాస్, నాయకులు ఎం.వెంకటేశ్వరావు, ఆర్.భీమరాజు, ఎస్.గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

గోపన్నపాలెం వ్యాయామ కళాశాల పరిశీలన

దెందులూరు, జూలై 17 : గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలను మాజీ సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నానిబాబు ఆధ్వర్యంలో బుధవారం సందర్శించారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్‌ను అడిగి తెలుసుకుని పరిశీలించారు. కళాశాల అభివృద్ధిపై ఎమ్మెల్యే చింతమనేనికి నివేదిక ఇస్తామని తెలిపారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు చింత సుబ్బారావు, మారగాని సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, తదితరులు ఉన్నారు

బాలికలపై లైంగిక దాడులను అరికట్టాలి

బుట్టాయగూడెం, జులై 17 : బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను వెంటనే అరికట్టాలని ఉమ్మడి జిల్లా పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు బి.వినోద్ డిమాండ్ చేశారు. బాలికలను వేధించడమే కాకుండా కిడ్నాప్‌లు, అత్యాచారాలు చేసి హత్యలు చేయడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలపై పాలకులు నోరు మెదపకపోవడం బాధకరమన్నారు. హోం మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు పరామర్శలు కూడా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఉంగుటూరు, జూలై 17 : పేదలకు సేవ చేయడం ద్వారా సమాజంలో గుర్తింపు లభిస్తుందని మానవత రీజియన్ చైర్మెన్ పుప్పాల గోపి, మాజీ ఎమ్మెల్యే సోదరుడు పుప్పాల కార్తీక్ అన్నారు. కైకరంలో మదర్ థెరిస్సా సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

జీవ వైవిధ్యానికి అడవులు నిలయాలు

టి.నరసాపురం, జూలై 17: అడవులు జీవ వైవిధ్య నిలయాలు మాత్రమే కాకుండా మానవ అవసరాలను తీరుస్తూ పర్యావరణాన్ని కాపాడే రక్షకులు అని బంజారా బజరంగీ భేరి కమిటీ జిల్లా నాయకుడు బూక్యా నాగరాజు నాయక్ అన్నారు. కృష్ణాపురం గ్రామ అడవుల్లో కమిటీ ఆధ్వర్యంలో వేప, నేరేడు, జీడి, మామిడి, పనస, కుంకుడు, సీతాఫలం మొదలగు విత్తనాలు కమిటీ సభ్యులు చల్లారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి బూక్యా వేణుగోపాల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు జరబల కృష్ణప్రసాద్, బూక్యా బిగనాధం, ధరావత్ రవి, బంగారయ్య, హసావత్ రవీంద్ర, బూక్యా రాములు, శ్రీనివాస్, బూక్యా చంటి, సురేష్, బద్దుబాబు, జరబల బాలకృష్ణ పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదలపై హర్షం

పెదపాడు, జూలై 17 : జీపీఎస్ జీవో గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదల చేయాలని ఆదేశించడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.



లక్ష్మీపురం ఆలయానికి సారె తీసుకువెళ్తున్న తిమ్మాపురం గ్రామస్తులు



ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలోని వృక్షాలకు పూజలు చేస్తున్న భక్తులు



పోలవరం పాండురంగ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో ఆషాఢం సారె సమర్పిస్తున్న మహిళలు



ఏలూరు ఆర్‌ఆర్‌పేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

తొలి ఏకాదశి పూజలు

» కిటకిటలాడిన ఆలయాలు » నోములు, వ్రతాలు » ఆషాఢం సారె సమర్పణలు

పురాణాల ప్రకారం స్థితికారకులైన శ్రీమహా విష్ణువు పాలకడలిలో ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు యోగ నిద్రకు ఉపక్రమిస్తాడని తెలియచేయడంతో దీనినే శయన (తొలి) ఏకాదశి అంటారు. ఈ ఏకాదశి నుంచే హిందువుల పండుగలు ప్రారంభమవుతాయి.

ద్వారకాతిరుమల, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ద్వారకాతిరుమల భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి క్షేత్రం భక్తజనులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి చినవెంకన్నను దర్శించుకునేందుకు యాత్రికులు మంగళవారం రాత్రికే ఆలయానికి చేరుకున్నారు. పలువురు పాద యాత్రగా క్షేత్రానికి రాగా వారంతా బుధవారం తెల్లవారజామున శ్రీవారి తొలిదర్శనం చేసుకున్నారు.

సుభద్రా, బలభద్ర, జగన్నాథులకు సారె

పురాతన లక్ష్మీపురం ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర, జగన్నాథులకు తొలిసారిగా తిమ్మాపురం స్వీట్లు, వివిధ రకాల పిండి వంటలతో మహిళలు పెద్ద ఎత్తున స్వామి, అమ్మవార్లకు సారె అందించారు.

● ఏలూరు కార్పొరేషన్ : తొలి ఏకాదశి సందర్భంగా నగరంలోని పలు డివిజన్లలో గల ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామిని, పెరుగుచెట్టు సెంటర్‌లోని వాసవీ మాతను వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి అలంకరించారు. అగ్రహారంలోని జనార్దన స్వామి, కుండీ సెంటర్‌లో విఘ్నేశ్వరస్వామి, సత్రంపాడులోని అంబికాదేవిని భక్తులు దర్శించుకున్నారు. కత్తేపువీధిలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ మందిరంలోని సీతమ్మవారికి ఆషాడ సారెను సమర్పించారు. సత్యసాయి సేవా సంస్థ సభ్యులు తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రధాన రహదారి పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

● బుట్టాయగూడెం : రెడ్డిగణపవరంలో వేంచేసిన కనకదుర్గమ్మవారికి ఆర్య వైశ్య మహిళలు కుటుంబ సమేతంగా వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పసుపు కుంకుమలతో ఆషాఢం సారె సమర్పించారు.

● పోలవరం :గరుడాద్రి పర్వతంపై ఉన్న పాండురంగడి ఆలయంలో స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వందలాదిగా భక్తులు తరలి వచ్చారు. కేదాసు మోహనరావు కుటుంబీకులు భక్తులకు పులిహోర ప్రసాద వితరణ చేశారు. కోటంరాజు రాంబాబు, సంగిసీడి రాము పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : బుట్టాయగూడెం రోడ్డులోని రుక్మిణీ సత్యభామ సహిత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి అష్టోత్తర శతకలశ అభిషేక క్రతువు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విష్ణు సహస్ర పారాణం చేసినట్లు ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. స్థానిక విజయ దుర్గ అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, మాడా రామ్మోహనరావు, మానేపల్లి రోహిణి పాల్గొన్నారు.



శాకాంబరి అలంకారంలో ఏలూరులోని వాసవీ మాత

● చింతలపూడి : మండలంలో తొలి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమహావిష్ణువు చిత్రపటాలు పెట్టి గోధుమ అప్పాలు, పేలాల పిండి నైవేద్యాలుగా సమర్పించి పూజలు చేశారు.

● ఉంగుటూరు : మండలంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వరాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పేలాలని ప్రసాదంగా పంపిణీ చేశారు.

● కొయ్యలగూడెం : తొలి ఏకాదశి సందర్భంగా మదనగోపాల స్వామిని ప్రతేక్యకంగా ఆలంక రించారు. ఉదయం నుంచి ఆలయాలు కిటకిటలా డాయి.

● నిడమర్రు : తొలి ఏకాదశి శ్రీమహావిష్ణువు పాలసముద్రం పై శయనిస్తాడని ఆసందర్భముగా తొలి ఏకాదశిని శయన ఏకాదశి గా పిలుస్తారని విష్ణు సాయి జ్ఞాన జ్యోతి సంస్థ నిర్వాహకులు చక్రవర్తుల సుబ్బారావు తెలిపారు. అడవికొలను కేశవస్వామి ఆలయంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని విశిష్ట పూజలు నిర్వహించారు.

● భీమడోలు :తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలకు భక్తులు బారులు తీరారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● కామవరపుకోట :కొత్తూరు గ్రామ దేవత గంగానమ్మకి భక్తులు సారెను సమర్పించారు. యన్నం శెట్టి సుజాత, జల్లి తేజ, నవరం సాయి, శిరిగినేటి మాధవి పాల్గొన్నారు. కామవరపుకోటలోని లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్యశ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపించి పేలాల పిండిని ప్రసాదంగా అందజేశారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూలై 17: ప్రజారోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరంలో తెల్లవారుజామున పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు 48, 49 డివిజన్లలో వర్షపు నీరు చేరిందని ప్రజల ఫిర్యాదు మేరకు ఆయా డివిజన్స్‌లో పర్యటించారు. తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మాజీ డిప్యూటీ మేయర్ నెరుసు సుగుణ గంగరాజు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, తాతాబ్బాయి, రఫీ, మాజీ కార్పొరేటర్ కృష్ణవేణి, రెడ్డి నాగరాజు, అమరావతి అశోక్ పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం

● గుండె జబ్బు అత్యంత ఖరీదుతో కూడుకున్న వైద్యమని అటువంటి వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఈ నెల 21న ఏలూరు ఏరియా ఆస్పత్రిలో విజయవాడకు చెందిన పీవీఆర్ కార్డియాక్ అండ్ మల్టీస్పెషలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. గుండె జబ్బు ఉన్నవారు ఎమ్మెల్యే లేటర్ తీసుకుని విజయవాడ పీవీఆర్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. పవర్‌పేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో చోడే వెంకటరత్నం, బెల్లంకొండ కిషోర్, ఆర్నేతిరుపతి, మారం హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం దక్షిణపు వీధిలోని జైన్ ప్రార్థన మందిరంలో తొలి ఏకదశి ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకు ముందు 49వ డివిజన్ బాలత్రిపుర సుందరి సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో చంటి ప్రత్యేక పూజలు చేశారు.



యాదవనగర్‌లో మురికి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

● 3వ డివిజన్‌లో టీడీపీ ఇన్‌చార్జి జాలా బాలాజీ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు మురుగు కాల్వలో ఉన్న సిల్ట్ తొలగించారు.

శాంతి భద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యం

ఎస్పీ ప్రతాప్ శివకిశోర్



మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

పెదవేగి, జూలై 17 : శాంతి భద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యం ఇస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పెదవేగి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ, స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ పరిసరాలు, ఫిర్యాదుదారులపై తీసుకుంటున్న చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి తో కఠినంగా వ్యవహరిస్తామని, గ్రామాల్లో వివాదాలకు పోకుండా మంచిని పెంచాలని సూచించారు. కోడిపందాలు, పేకాట నిర్వహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ వెంట ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య, పెదవేగి సీఐ కె.శ్రీనివాస్ కుమార్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

వైసీపీ పాలనతో సమస్యల ఊబిలో గ్రామాలు



మొక్కను నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు, జూలై 17 : గత వైసీపీ పాలనతో రాష్ట్రంలోని గ్రామాలన్నీ సమస్యల ఊబిలో చిక్కుకున్నాయని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మీకోసం-మీచింతమనేని కార్యక్రమంలో భాగంగా కొత్తముప్పర్రు, పాతముప్పర్రు, జయపురం, తాళ్లగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ప్రభాకర్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జయపురంలో బ్రిడ్జి సామర్థ్యం, స్థితిపై తక్షణం నివేదికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉప్పలపాటి రాంప్రసాద్, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాస రావు, కొత్తూరు చినబాబు, కలిపిండి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెదవేగి : మొక్కలను నాటి, సంరక్షించాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్యే చింతమనేని అన్నారు. గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలసి దుగ్గిరాలలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దుగ్గిరాల సర్పంచ్ గుంజా క్రీస్తుమణి, వి.మనోహరి, టీడీపీ పెదవేగి మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్, ఏపీవో కిషోర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన టీడీపీ నాయకులు



కుక్కునూరులో మొక్కలు నాటుతున్న టీడీపీ నేతలు

కుక్కునూరు, జూలై 17: పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వ రరావు అన్నారు. టీడీపీ అధ్యక్షుడు ములిశెట్టి నాగే శ్వరరావు పుట్టి నరోజు సందర్భంగా బుధవారం కుక్కునూరులోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో టీడీపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగు లకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అదే సమయంలో తన భార్య ములి శెట్టి సుజాత జ్ఞాపకార్థం కుక్కునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వారి అవసరాల నిమిత్తం రూ.50 వేలు విలువ చేసే ప్రింటర్ అందజే శారు. కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు స్వీట్లు పంచారు. అనంతరం కూటమి నాయకులు, కార్య కర్తలు, అభిమానులు సమక్షంలో కేకు కట్ చేసి అన్నదానం నిర్వహిం చారు. టీడీపీ నాయకులు కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, పులి శ్రీను, కే.రమణరాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, ఎం.వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం : సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖర్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం ఆస్పత్రి ఎదురుగా 16వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం శశి శేఖర్ 20 మొక్కలు నాటి వాటికి సంరక్షణ ట్రీలను ఏర్పాటు చేశారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి

లింగపాలెం, జూలై 17: చంద్రన్నపాలెం డ్వాక్రా మహిళలకు సంబంధించిన రూ.28 లక్షలకు పైగా స్వాహా చేసిన సొమ్మును వెంటనే స్వాధీనం చేసుకోవాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.రామకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నగదు స్వాహా చేసిన ఏపీఎం, బ్యాంకు మేనేజరు, వీవోఏలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం, జూలై 17 : స్థానిక ధర్మన్న మెమోరియల్ హాలులో ది జంగారెడ్డిగూడెం ఫోటో, వీడియో, మిక్సింగ్ యూనియన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా ఎం.రవీంద్ర రెడ్డి (వెంకట్‌రెడ్డి) ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.జగన్, కోశాధికారిగా సీహెచ్ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా వై.సూరిబాబు ప్రమాణస్వీకారం చేశారు.

సమాజ హితం కోసం రోటరీ సేవలు

పోలియో రహిత సమాజం కోసం రోటరీ చేసిన సేవలు మరువలేనివని జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు ఊడా రామ్‌గోపాల్(గోపి) అన్నారు. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ 2024-25కి గాను అధ్యక్షుడిగా ఊడా రాంగోపాల్(గోపీ), ప్రధాన కార్యదర్శిగా బవిరిశెట్టి హనుమాన్ తిలక్, అసిస్టెంట్ గవర్నర్‌గా దాకారపు కృష్ణ ఎన్నికయ్యారు. రోటరీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

అభ్యంతరాలు తెలపాలి

ఏలూరు కార్పొరేషన్, జూలై 17 : దెందులూరు మండలం శ్రీరామవరంలోని సీతారామస్వామి దేవస్థానం గ్రామస్తుల వినతిపై సదరు దేవాలయానికి ధర్మాదాయ శాఖ వారు పబ్లికేషన్ నిమిత్తం అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని దేవాదాయశాఖ అధికారి, సింగిల్ ట్రస్టీ కార్యనిర్వహణాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరస్పర దాడులు.. ఇరు వర్గాలపై కేసులు

జంగారెడ్డిగూడెం, జూలై 17 : శ్రీనివాసపురంనకు చెందిన తండ్రీ కొడుకులను కొట్టి గాయపరచిన వారిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. గ్రామానికి చెందిన పోల్నాటి మంగ ప్రసాద్‌కు అదే గ్రామంలో రెండె కరాలు వ్యవసాయ భూమి ఉంది. ఏటా శ్రీనివాసపురంనకు చెందిన తమ్మిశెట్టి రామకృష్ణకు ఎకరం భూమి కౌలుకు ఇచ్చేవాడు. ఈ ఏడాది ఫైసన్నగూడెంకు చెందిన వామిశెట్టి పండుకు కౌలుకు ఇవ్వడంతో ఈ నెల 16న పాత కౌలుదారుడు తమ్మిశెట్టి రామకృష్ణ, వామిశెట్టి నరేష్ (పండు)కు ఫోన్ చేసి అధిక కౌలు ఇచ్చి ఎందుకు తీసుకున్నావని అతనితో దుర్భాషలాడాడు. అదే విషయంపై పొలం యజమానిని ప్రశ్నించడానికి తమ్మిశెట్టి రామకృష్ణ మరో ముగ్గురితో కలిసి పొలం వెళ్లాడు. అక్కడ పని చేసుకుంటున్న పోల్నాటి మంగ ప్రసాద్ తండ్రి వీపుపై రామకృష్ణ కర్రతో కొట్టి గాయపరచగా అడ్డు వెళ్లిన మంగ ప్రసాద్‌పై కూడా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి భార్య గాయపడిన ఇద్దరినీ జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారంతో, బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఇదిలా ఉండగా శ్రీనివాసపురంనకు చెందిన తమ్మిశెట్టి నాగలక్ష్మి తనను అదే గ్రామానికి చెందిన పోల్నాటి నాగేశ్వరరావు మరో ఐదుగురు కొట్టి గాయపరిచారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జ్యోతి బసు తెలిపారు. గతేడాది వామిశెట్టి రామ బుచ్చియ్యకు చెందిన ఎకరం భూమిని తనకు కౌలుకు ఇచ్చారని ఈ ఏడాది కూడా తనకే ఇస్తానని చెప్పి మరోకరికి ఇవ్వడంతో అతను పొలం దున్నుతుండడంతో అడగడానికి పోల్నాటి నాగేశ్వరరావు ఇంటికి వెళ్లగా నాగేశ్వరరావుతో పాటు నాగలక్ష్మిని చేతిపై కొట్టి గాయపరచాడన్నారు. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగిందన్నారు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోల్నాటి నాగేశ్వరరావు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

యువతి అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం, జూలై 17 : తమ కుమార్తె కనబడడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. ఇంటి వద్దనే ఉంటు ఇంజనీరింగ్ సీటు కోసం ఎదురు చూస్తున్న యువతి ఈ నెల 15వ తేదీ ఉదయం బంధువుల ఇంటికి వెళ్లింది. ఆమె తండ్రి మధ్యాహ్నం పొలం నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి తన కుమార్తె ఇంట్లో కనిచంచలేదన్నారు. చుట్టుపక్కల వారు చెప్పిన వివరాల ప్రకారం తన కుమార్తెను ఒక వ్యక్తి కారులో తీసుకు వెళ్లినట్లు తెలిసిందన్నారు. ఆ కారు నెంబరు ఆధారంగా వివరాలు సేకరిస్తే అతను తన కుమార్తెకు పరిచయం ఉన్న భీమవరానికి చెందిన వెలుదుటి సాజి అని తెలిసిందని తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, జూలై 17: శాంతినగర్, సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతు పనుల కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విత్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ నటరాజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ కల్యాణ మండపం, సీఆర్ రెడ్డి కళాశాల ప్రాంతం, కలెక్టర్, జడ్పీ బంగళా, జేవీఆర్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నాయకులకు పరామర్శ

టి.నరసాపురం, జూలై 17: వెలగపాడులో ఇటీవల అనారోగ్యానికి గురైన టీడీపీ నాయకుడు బొడ్డు సింహాచలం, గూట్ల ఏసుపాదం, మాణిక్యంను పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు బుధవారం పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సర్పంచ్ జలపాలు, పలువురు నాయకులు ఉన్నారు.

రహదారిపై కూలిన వృక్షాలు

పోలవరం, జూలై 17 : మండలంలో తెల్లవారుజామున వీచిన గాలులకు కన్నాపురం అడ్డ రోడ్డు సమీపంలో రహదారిపై భారీ వృక్షాలు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన వృక్షాలను తొలగించడంతో మార్గం సుగమం కాగా వాహనాల రాకపోకలు కొనసాగాయి.

సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, జూలై 17: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ధర్మాజిగూడెం పీహెచ్‌సీ వైద్య అధికారిణి యానీప్రీతి అన్నారు. ధర్మాజిగూడెం పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మక్కపాలెంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, వారికి సీజనల్ వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ కూరపాటి వెంకటేశ్వర రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, ఎంపీహెచ్‌వో రామ్మోహన్, సూపర్ వైజర్లు పద్మజ, సారథి, గ్రామ కార్యదర్శి నవీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● టినరసాపురం : గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది జాగ్రత్త చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ శర్మిష్ఠ సూచించారు. టి.నరసాపురం, బొర్రంపాలెం ప్రభుత్వా స్పత్రులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. దిగువ ప్రాంతం కావడం వల్ల టి.నరసాపురం ప్రభుత్వాస్పత్రి ఆవరణ మొత్తం వర్షపు నీరు నిల్వ ఉండడంతో సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులకు లేఖ రాయమని వైద్యులకు సూచించారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్యులు జె.కల్పనారాణి, ఫణీంద్ర, ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో 75 వేల మెట్రిక్ టన్నుల ఇసుక

ఉంగుటూరు, జూలై 17 : జిల్లాలో ప్రస్తుతం 75 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని జిల్లా పంచాయతీ అధికారి, శాండ్ కమిటీ సభ్యుడు తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఇక్కడ టన్నుకు రూ.538లుగా నిర్ణయించామని, కావలిసివారు ఆధార్ కార్డు ద్వారా 20 టన్నులు పొందవచ్చన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు

జీలుగుమిల్లి, జూలై 17 : అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పోలవరం డీఎస్పీ సతీష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. జీలుగుమిల్లి సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. టీ.నర్సాపురం మండలం పోక్సో కేసు విషయమై సీఐ క్రాంతికుమార్‌తో చర్చించారు. గంజాయి, ఇసుక, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. వరదల సమయంలో విద్యార్థులు, యువకులు చెరువులు కాలువల వద్దకు వెళ్లే సమయాల్లో సెల్ఫీల మోజులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఎస్సైలు చంద్రశేఖర్, మహేష్ ఉన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి

ఏలూరు క్రైం, జూలై 17 : ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో తొమ్మిది మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చేసినట్లుగా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. యువకుల నుంచి రక్తాన్ని సేకరించడానికి కళాశాల వద్ద ఏసీ మొబైల్ బ్లడ్ కలెక్షన్ బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, బిఆర్‌సిహెచ్ నారాయణ, డాక్టర్ జి స్పందన, లైన్స్ డిస్ట్రిక్ట్ ఉమెన్ లీడర్ కె పద్మావతి, లైన్స్ గైనార్కీ క్లబ్ ప్రెసిడెంట్ ఎం అనుపమ, కేవీ రమణ పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోంకు పది బస్తాల బియ్యం వితరణ

ఏలూరు రూరల్, జూలై 17: ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో 1986-89లో బీఎస్సీ చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం కోణంగి రోడ్డులో ఉన్న శ్రీఎడ్యుకేషనల్, ఇన్‌ఫెక్టెడ్ చిల్డ్రన్ సొసైటీకి పది బస్తాల బియ్యం అందజేశారు.

ఎంపీడీవో ఎక్కడ ?



ఇంకా లభించని ఆచూకీ

విజయవాడ, ఏలూరు జిల్లాల్లో గాలింపు

నరసాపురం రూరల్, జూలై 17: నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ ఆచూకీ లభించ లేదు.కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు విజయవాడ, ఏలూరు జిల్లాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఏలూరు కాల్వ వద్ద ఎంపీడీవో చెప్పులు కనిపించడంతో గజ ఈతగాళ్లతో కాల్వ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం వరకు ఆయన ఆచూకీ దొరక లేదు. నరసాపురం రేవు నిర్వహణదారుడు రెడ్డప్ప ధవేజీ మండల పరిషత్‌కు రూ.55 లక్షల వరకు చెల్లించాలి. ఈ బాకీ వసూలు విషయమై ఆయన రెండు నెలల నుంచి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నెల 3 నుంచి మెడికల్ లీవ్ పెట్టి కృష్ణా జిల్లా పెనమలూరులో ఆయన ఇంటి వద్దనే ఉంటున్నారు. 17 వ తేదీ సోమవారం మచిలీపట్నం వెళ్లిన ఎంపీడీవో ఇంటికి తిరిగి రాలేదు. ఎంపీడీవో సెల్ నుంచి భార్యకు మెసేజ్ రావడంతో కుటుంబ సభ్యులు పెనుమలూరు పోలీసలను ఆశ్రయించారు. రెండు రోజుల నుంచి అన్ని కోణాల్లో గాలించి నప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించలేదు. ఇప్పటి వరకు పోలీసులు మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో ఎంపీడీవో బైక్‌ను, విజయవాడలోని ఏలూరు కెనాల్ వద్ద ఆయన చెప్పులను మాత్రమే గుర్తించారు. దీంతో ఆయన అదృశ్యం పెద్ద మిస్టరీగా మారింది. ఎంపీడీవో ఇంటికి క్షేమంగా రావాలని మండల పరిషత్ ఉద్యోగులతో పాటు సిబ్బంది, పట్టణ ప్రజలు కోరుకుంటు న్నారు. బకాయిపడ్డ ధవేజీ నుంచి ఎటువంటి స్పందన లేదు. కనీసం మండల పరిషత్ అధికారులతో ఆయన చర్చించ లేదు. దీంతో బాకీ కడతారా ? లేదా అన్న దానిపై పెద్ద చర్చ సాగుతోంది.

• ఆయనకేమైనా జరిగితే బాధ్యులపై కేసులు

ఎమ్మెల్యే నాయకర్



తన సర్వీస్‌లో అవినీతి మచ్చ లేకుండా నిజాయితీగా పని చేస్తున్న ఎంపీడీవో వెంకటరమణకు ఏమైనా జరిగితే మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, నిర్వహణదారుడు రెడ్డప్పధవేజీ, జేఏసీ కమిటీ సభ్యులపై కేసు పెడతామని ఎమ్మెల్యే నాయకర్ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యా లయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాకీ విషయంపై రేవు నిర్వహణ దారుడు ధవేజీకి అనేకమార్లు ఫోన్‌లు చేసినా, నోటీసులు ఇచ్చినా స్పందించ లేదన్నారు. ఇదే విషయం ఎంపీడీవో రెండు మూడు సార్లు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. బాకీ విషయంలో ఎంపీడీవో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మెడికల్ లీవ్ పెట్టారన్నారు. ముదునూరి నిర్లక్ష్యం వల్లే నిజాయితీపరుడైన ఎంపీడీవో బలి కావాల్సి వచ్చిందన్నారు. ఆయనకు ఏమైనా జరిగితే ఆ కుటుంబానికి ఏం సమాధానం చెపుతారంటూ నిలదీశారు. అవసరమైతే సీఎం చంద్రబాబు, జిల్లా కలెక్టర్ వద్దకు సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆయన ఎక్కడ ఉన్న క్షేమంగా ఇంటికి రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

ఎంపీడీవోకు అండగా ఉంటాం : పొత్తూరి



ఎంపీడీవో, ఆయన కుటుంబ సభ్యులకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు భరోసా ఇచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ అవినీతి ఆక్రమాలకు ప్రజలతో పాటు అధికారులు కూడా బలయ్యారన్నారు. బకాయిదారుడు పెండింగ్ సొమ్ము చెల్లించకపోవడం వల్లే ఎంపీడీవో మానసిక ఒత్తిడికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయారన్నారు.



ఏకలవ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా ఏకలవ్య జయంతి

కలిదిండి, జూలై 17 : ఏకలవ్య జయంతిని బుధవారం కలిదిండి మండల ఏకలవ్య సంఘం అధ్యక్షుడు కుంబా నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలిదిండిలోని ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంచారు. ఏకలవ్యుడి గురుభక్తిని, ఏకాగ్రతను, త్యాగనిరతి నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో దినతేజ్, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, సంఘ సభ్యులు కోతాడి శ్రీనివాసరావు, దానియేలు, కుంబా వేణు, దాసు రాజు తదితరులు పాల్గొన్నారు.



ముళ్ల పొదలు తొలగించిన తెలుగు తమ్ముళ్లు

నూజివీడు టౌన్, జూలై 17: అంత్యక్రియలు నిర్వహించేందుకు సైతం వీలు లేకుండా శ్మశానం మొత్తం ముళ్ల పొదలు పెరిగిన నేపథ్యంలో ముక్కొల్లుపాడు టీడీపీ నాయకులు తమ క్లస్టర్ ఇన్‌చార్జి పర్వతనేని సాయి ఆధ్వర్యంలో దళిత శ్మశాన వాటికలో యంత్రంతో ముళ్ల పొదలను తొలగింపునకు శ్రీకారం చుట్టారు. సొంత నిధులతో ముళ్ల పొదలు తొలగిస్తున్నామని సాయి తెలిపారు.

క్రైం సమాచారం

ఒకరి అనుమానాస్పద మృతి

కలిదిండి, జులై 17 : అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కోరుకొల్లు దళితవాడకు చెందిన పాతపాటి రమేష్ (45) ఈ నెల 15న అదృశ్యమయ్యాడు. అతడి ఆచూకి కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, బుధవారం తమ ఇంటికి సమీపంలో ఉన్న మురుగు బోదెలో రమేష్ శవమై తేలాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్‌ఐ గోవర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచార నిందితులు నలుగురు అరెస్ట్

టి.నరసాపురం, జూలై 17: మండలంలో ఒక గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకునితో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు పోలవరం డీఎస్పీ ఎస్.సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. అత్యాచార ఘటనపై ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నాగ కుమార్‌తో పాటు అతనికి సహకరించిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



సూరేపల్లిలో కట్ చేసిన కేబుల్ వైర్‌ను చూపుతున్న బాధిత రైతు

గోడు పట్టదా..?

» బాధిత రైతుల ఆక్రోశం » ఆగని రాగి వైర్ల చోరీ..

» పోలీసులకు ఫిర్యాదుచేసినా ఫలితం లేదని ఆవేదన

ముసునూరు, జూలై 17: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు సంబంధించిన సామగ్రిలో రాగి వైర్ చోరీలు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రి సమయాల్లో కేబుల్ వైర్, స్టార్టర్, ఫ్యూజుల్లోని రాగివైర్‌ను దుండగులు చోరీ చేస్తుండటంతో బాధిత రైతు రూ. 10 వేల నుంచి 15 వేలు వరకు నష్టపోతున్నాడు. తాజాగా సూరేపల్లికి చెందిన రైతులు గుంట్రు శ్రీనివాసరావు, తాళ్ల గోపాలరావు వ్యవసాయ బోర్ల నుంచి కేబుల్, ఇతర సామగ్రిలో రాగివైర్‌ను దొంగిలించుకుపోయారు. సుమారు విలువ రూ. 30 వేలు ఉంటుందని, చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధిత రైతులు తెలిపారు. ఇటీవల గోపవరం, పెద్దపాటివారిగూడెం, కొర్లకుంట, ముసునూరు తదితర గ్రామాల్లో వారం రోజల వ్యవధిలో ఒక్కొక్క గ్రామంలో 20 నుంచి 30 బోర్ల సామగ్రి చోరీ అయ్యాయి. వీటిపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవని బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక నిఘా పెట్టి నియంత్రించేలా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



వదాలి జగన్నాథస్వామికి భక్తుల పూజలు



ఆగిరిపల్లి శోభనాచలస్వామి



ముసునూరు వేంకటాచల స్వామి

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ముదినేపల్లి, జులై 17 : తొలి ఏకాదశిని బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైష్ణవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. వదాలిలోని సుభద్ర, బలరామ సహిత జగన్నాథ స్వామి ఆలయంలో ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు పూజలు నిర్వహించారు. సింగరాయపాలెం లోని శ్రీ లక్ష్మీనృశింహస్వామి, ముదినేపల్లిలోని పెద రామాలయం, గౌడ రామాలయం, భక్తాంజనేయ స్వామి ఆలయాల్లో, పెదగొన్నూరు, బొమ్మినం పాడు, పెదపాలపర్రు రామాలయాల్లో తొలి ఏకాదశి పూజలు జరిగాయి.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఎగువ, దిగువ సన్నిధిలో స్వామి వార్లకు వేకువ జామునే అర్చకులు పంచామృత స్నపన, విశేష అలంకరణ చేశారు. ఆగిరిపల్లిలోని కోదండ రామాలయంలోనూ, నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డు గల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో భారీగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ముసునూరు: ముసునూరులోని వేంకటాచలస్వామికి ఆలయ అర్చకులు వేదాంతం లక్ష్మీనరసింహాచార్యులు విశేష అభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రేగుల రాణి ఆధ్వర్యంలో మహిళలు విష్ణుసహస్రనామ పారాయణం, ఏకనామ సంకీర్తన చేశారు.

చాట్రాయి: మండల ప్రజలు తొలి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గృహాల్లో కుటుంబసభ్యులు అందరూ కలిసి పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి.



కైకలూరు తాగునీటి చెరువును పరిశీలిస్తున్న సర్పంచ్ నవరత్నకుమారి

ప్రతిరోజూ తాగునీటి సరఫరాకు చర్యలు

కైకలూరు జూలై 17 : కైకలూరు పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కైకలూరు సర్పంచ్ డీఎం నవరత్నకుమారి అన్నారు. బుధవారం కైకలూరు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న మంచినీటి చెరువులకు మోటార్ల ద్వారా నీటిని నింపే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో నీరు లేక చెరువులు అడుగంటిపోయాయని కాలువలకు నీరు విడుదల చేసినందున ఇకపై కైకలూరు ప్రజలకు ప్రతి రోజు నీరందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహకారంతో ప్రత్యేక కమిటీ సభ్యులు పంటకాలువ అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారని అన్నారు. గతంలో చెత్తను మాత్రమే తొలగించి వదిలివేశారని ఇపుడు కాలువలో మురుగును సైతం ఎక్స్‌కవేటర్లతో తీసి ఇతర ప్రాంతాలకు తరలించడంతో కాలువల్లో ఉండే చెత్తాచెదారం బయటకు వెళ్లిపోతుందన్నారు. రెండు రోజుల పాటు కాలువల్లోని మురుగు కిందకి వెళ్లిపోయేలా చర్యలు తీసుకున్నామని ప్రస్తుతం పది మోటార్లతో మంచినీటి చెరువులను నింపే పనులను ప్రారంభించామన్నారు. పంచాయతీ సిబ్బంది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఐదేళ్లూ అరాచక పాలన

ముదినేపల్లి, జులై 17 : వైసీపీ అయిదేళ్ల పాలన భూ దందాలు, సహజ వనరుల దోపిడీ, అరాచక విధానాలతో కొనసాగిందని టీడీపీ నాయకులు విమర్శించారు. బుధవారం సాయంత్రం ముదినేపల్లిలోని ఎన్‌డీఏ కార్యాలయం లో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, నాయకులు లింగమనేని భాను ప్రసాద్, పోసిన పాపారావు గౌడ్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు ఎన్నో నిర్ణయాలు తీసుకుందన్నారు. ప్రధానంగా ల్యాండ్ టైటి లింగ్ యాక్ట్ రద్దు చేసిందని, కౌలు రైతులను ఆదుకునేందుకు కూడా కార్యాచరణ రూపొందిస్తున్నదని తెలిపారు. వైసీపీ నాయకులు ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. కాలనీల నిర్మాణం పేరుతో పేదలను దోచుకున్నారని, పోలవరం ప్రాజెక్టును కాలగర్భంలో కలిపేశారని, ఏ వ్యవస్థ చూసినా అప్పులకుప్పలా మారిందని విమర్శించారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రాలను నాయకులు ప్రదర్శించారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంత గాని సురేష్, మహిళా నాయకురాలు యలవర్తి భవాని తదితరులు పాల్గొన్నారు.





ముదినేపల్లి.. నూజివీడు.. ఆగిరిపల్లిలో పీర్ల ఊరేగింపు



ఘనంగా పీర్ల ఊరేగింపు

ఆగిరిపల్లి, జూలై 17: మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్‌ను యుద్ధ విరామంలో ప్రార్థనలో ఉన్న సమయంలో మోసపూరితంగా హతమార్చిన దినాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లిలో పీర్ల ఊరేగింపు జరిపారు.

నూజివీడు టౌన్: త్యాగధనులను స్మరిస్తూ ముస్లింలు నిర్వహించే మొహరం పండుగను నూజివీడులోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాసం చేసి పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని త్యాగధనులు త్యాగాలను స్మరిస్తూ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లిం పాల్గొన్నారు.

ముసునూరు: మొహరం పర్వదినాన్ని బుధవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గోపవరం, గుడిపాడు, చెక్కపల్లి, ముసునూరు తదితర గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురవులు మొహరం విశిష్టత, మహ్మద్ ప్రవక్త బోధనలను ఉద్బోధించారు. అనంతరం పెద్దఎత్తున హజ్రత్ ఇమాం హుస్సేన్ గుర్తుగా పంజా ప్రతిమలు, పీర్ల ఊరేగింపు నిర్వహించారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో పలువురు ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలతో నిప్పుల గుండంపై నడిచారు. అనంతరం పీర్లతో ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో పాటు మసీదు కమిటీ నాయకులు షేక్ బాజీ, సిద్ధిక్, రియాజ్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు అల్లా భక్షు తదితరులు పాల్గొన్నారు. సంకర్షణపురంలో మండల పరిషత్ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు మజీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.



కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో మొక్కలు నాటుతున్న మానవత సభ్యులు

మొక్కలు నాటి.. సంరక్షించాలి



కాళ్లపాలెంలో...

కైకలూరు జూలై 17 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ అన్నారు. బుధవారం కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో కాలనీ కమిటీ, మానవత ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. తమ పుట్టిన రోజు, పెళ్ళి రోజుల నాడు మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా చేపట్టాలని పలువురు పిలుపునిచ్చారు. వార్డు సభ్యులు కేవీఎస్ఎం నాయుడు, మానవత సభ్యులు గుర్రం శ్యాంకుమార్, మాడెం సత్యనారాయణ, పి. పవన్‌కాంత్, ఎండీ బాబు, నారగాని సత్యనారాయణ, శివ, విఠల్, జెట్టి శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కాళ్లపాలెం సర్పంచ్ స్వర్ణ కుమారి అన్నారు. బుధవారం కాళ్ల పాలెంలో పోల్ రాజ్ కెనాల్ వెంబడి కొబ్బరి మొక్కలను నాటారు. కూటమి నాయకులు పేటేటి కనక లింగేశ్వరరావు, మేడిశెట్టి సీతారామాంజనేయులు, నీలపాల శివరామకృష్ణ, మద్రే ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఊటుకూరు మీడియం డ్రైన్‌లో దట్టంగా పెరిగిన కిక్కిస

ముంపులో 300 ఎకరాలు

కిక్కిసతో నిండిన డ్రెయిన్లు ● వెదజల్లిన పైరుకు నష్టం

ముదినేపల్లి, జులై 17 : ముదినేపల్లి ప్రాంతంలోని మేజర్, మీడియం, మైనర్ డ్రైన్లు కిక్కిస, గుర్రపు డెక్కతో నిండిపోయాయి. వర్షాలకు అన్ని డ్రైన్లు పొంగుతున్నాయి. ఐదేళ్లుగా డ్రైన్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీటి పారుదల సమస్య జఠిలమైంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రెయిన్ల శివారు భూములు ముంపునకు గురయ్యాయి. పెదలంక, పోల్ రాజ్, పెదకొమ్మిలేరు, చిన కొమ్మిలేరు, తుమ్మిడి - చెన్నూరు మేజర్ డ్రైన్లతోపాటు అన్నవరం, వూటుకూరు, పోల్ రాజ్ సబ్సిడియరీ మీడియం డ్రైన్లు, పలు మైనర్ డ్రైన్లు గుర్రపు డెక్కతో, కిక్కిసతో నిండిపోయాయి. ఊటుకూరు మీడియం డ్రైన్‌లో కిలోమీటర్ల దూరం కిక్కిస దట్టంగా పెరిగిపోయింది. దీంతో నీరు కదలకుండా ఊటుకూరు డ్రెయిన్ కింది ప్రాంతంలో 300 ఎకరాల ఆయకట్టు పొలాల్లో ముంపు ఏర్పడింది.

అస్తవ్యస్తంగా డ్రైన్లు : పోసిన పాండురంగారావు, టీడీపీ నాయకుడు

వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షానికే పొలాల్లో ముంపు ఏర్పడే పరిస్థితి ఏర్పడింది. గత సార్వా సీజన్‌లో ఏర్పడిన పంట నష్టం పునరావృతం కాకుండా ప్రభుత్వం డ్రెయిన్లలో కిక్కిస తొలగింపు పనులు చేపట్టాలి.

ప్రతిరోజూ అమావాస్యే!



సోమవరంలో వెలగని వీధిలైటు

చాట్రాయి, జూలై 17: మండలంలోని సోమవరంలో వీధిలైట్లు వెలగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వీధుల్లో సర్పాలు సంచరిస్తున్నాయని ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నామని, అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి: చలసాని

నూజివీడు, జూలై 17: మదనపల్లి హార్సిలీ హిల్స్‌లో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు కోరారు. ఈ మేరకు కరపత్రాన్ని నూజివీడు అమర్ భవన్‌లో ఆవిష్కరించారు. మున్సిపల్ రంగంలో పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగంలో జరగబోయే మౌలిక మార్పులు, కార్మికుల విధి విధానాల పట్ల అవగాహన కలిగించటానికి శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బుచ్చిబాబు, ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, జిల్లా మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కె.విఘ్నేష్, నూజివీడు మున్సిపల్ యూనియన్ నాయకులు కె.సుదర్శనం, శ్రీనివాసరావు, ఎరిక్సన్, యం.విజయ్, ఎం.ఏసు, నంద తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రస్థాన సాధనపై శిక్షణ

నూజివీడు, జూలై 17: ఆధ్యాత్మిక విశ్వగురువు సైంటిఫిక్ సెయింట్ శ్రీ గురువిశ్వస్ఫూర్తి గురుదేవుల ఆశీస్సులతో గురువారం నుంచి ప్రస్థాన సాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్ఫూర్తి కుటుంబం ఏపీ, తెలంగాణ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రస్థాన సాధన (యోగా, ప్రాణాయామ, ధ్యానం) శిక్షణ తరగతులు ఆన్‌లైన్‌లో జరుగుతాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న గురుపీఠాల్లో ప్రస్థాన సాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూజివీడులోని సంఘం కాంప్లెక్స్ ప్రాంగణంలోని గురుపీఠంలో ఉదయం 4.30 నుంచి 6.30 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు జరుగుతాయని, ప్రజలు పాల్గొని యోగా, ప్రాణాయామంతో జ్ఞానశక్తిని పెంపొందించుకోవాలని నిర్వాహకులు, స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ సభ్యుడు టీవీఎస్ ప్రసాద్ కోరారు.

మంత్రి సారథిని కలిసిన ఎమ్మెల్యే చింతమనేని



నూజివీడు, జూలై 17: రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని బుధవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నూజివీడులోని మంత్రి పార్థసారథి క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలసిన ఎమ్మెల్యే చింతమనేని హౌసింగ్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని చింతమనేని సారథిని కోరారు. దెందులూరు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకుడు



చాట్రాయి, జూలై 17: మండలంలోని సి.గుడిపాడుకు చెందిన టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు తల్లాడ పవన్‌కుమార్ చంద్రబాబు సీఎంగా, కొలుసు పార్థసారథి మంత్రిగా పదవులు చేపడితే మెట్ల మార్గంలో వెళ్లి తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నాడు. కోరిక నెరవేరడంతో టీడీపీ జిల్లా బీసీసెల్ కార్యదర్శి తల్లాడ శ్రీనివాసరావు కుమారుడైన పవన్‌కుమార్ బుధవారం తిరుపతి అలిపిరి నుంచి మెట్ల మార్గంలో కొండ ఎక్కి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

వేల్పుచర్లలో పారిశుధ్య పనులు

ముసునూరు, జూలై 17: వేల్పుచర్ల పంచాయితీ పరిధిలోని అన్ని కాలనీల్లో పారిశుధ్యం మెరుగుకు సర్పంచ్ పుట్ల మోహనరావు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. బుధవారం ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టి, మురుగునీటి నిల్వలను తొలగించారు. చెత్తాచెదారాన్ని రిక్షాల ద్వారా గ్రామ శివారుకు తరలించి, బ్లీచింగ్ చల్లించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారుశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని, దోమల నివారణకు త్వరలో ఫాగింగ్ చేస్తామని సర్పంచ్ తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

10.55 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం



ముదినేపల్లి, జులై 17 : ముదినేపల్లిలోని గురజ రోడ్డులో సీసీ డ్రైన్ నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఉప సర్పంచ్ ఈడే సుధాకర్ ప్రారం భించారు. రూ.10.55 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ డ్రైన్ నిర్మాణ పనులను చేపట్టారు. పంచా యతీ ఏరి యాలో మురుగునీటి సమస్య పరిష్కారానికి దశల వారీగా డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ పాల్గొన్నారు.

బీసీ భవన నిర్మాణం హర్షణీయం



గంగునేని వరప్రసాద్

కైకలూరు జూలై 17 : కైకలూరులో బీసీ భవన నిర్మాణాన్ని చేపడతామని ప్రకటించడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగునేని వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కైకలూరులో జరిగిన అభినందన సభలో మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ త్వరలో బీసీలకు భవనం ఏర్పాటు చేస్తామని, త్వరలోనే భవన నిర్మాణాన్ని కైకలూరు టీడీపీ నాయకుడు బీకేఎం నాని ఆధ్వర్యంలో పూర్తి చేస్తామని ప్రకటించడం అభినంద నీయమన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి



సిరిపురపు రాజబాబు

కలిదిండి, జులై 17 : జనసేన క్రియాశీల సభ్యత్వాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురపు రాజబాబు బుధవారం ప్రకటనలో కోరారు. ఈ నెల 18 నుంచి పది రోజులపాటు జరగనున్న నాల్గో విడత క్రియాశీల సభ్యత్వ నమోదులో జనసైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన సభ్యత్వం పొందిన వారి కుటుంబాలకు అధినేత పవన్ కల్యాణ్ రూ.5 లక్షల బీమా పరిహారం అందించారన్నారు. పాక్షికంగా గాయపడి, అనారోగ్యం పాలైన క్రియాశీల సభ్యులకు రూ.50 వేలు ఆర్థిక సాయమందించారన్నారు.